క్లుప్తంగా

డేటా ఎంట్రీ ఆపరేటర్లకు నియామకపత్రాలు



నియామకపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

చీమకుర్తి రూరల్: మండలంలో ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు శనివారం నియామక పత్రాలు అందజేశారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమితులైన అభ్యర్థులకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేస్తున్నట్లు ఎంపీపీ, జెడ్పీటీసీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే రాఘవేంద్ర, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అమిత్ షా తక్షణమే క్షమాపణ చెప్పాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

సంతనూతలపాడు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు డిమాండ్ చేశారు. సంతనూతలపాడు మండలం ఎండ్లూరు గ్రామంలో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద శనివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమిత్ షా కేంద్ర మంత్రి పదవికి అనర్హుడని, అతను వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కందుకూరి ఎలీషా, కంచర్ల పాతగిరిరావు, బిరుదుల దానియేలు, జక్రయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి వైభవంగా ధనుర్మాస పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

సంతనూతలపాడు: సంతనూతలపాడులోని శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలను శనివారం ఘనంగా నిర్వహించారు. జనవరి 15వ తేదీ వరకు పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

ఎంపీడీవోపై దాడికి ఖండన



ఎంపీడీవోపై దాడిని ఖండిస్తున్న మద్దిపాడు ఎంపీడీవో, సిబ్బంది

మద్దిపాడు: అన్నమయ్య జిల్లా గాలివీడు మండల ఎంపీడీవోపై దాడిని ఖండిస్తూ మద్దిపాడు ఎంపీడీవో వి.జ్యోతి, కార్యాలయ సిబ్బంది శనివారం నిరసన వ్యక్తం చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఎంపీడీవోపై దాడి చేయడం అమానుషమని జ్యోతి అన్నారు. దాడిని ఖండిస్తున్నామని తెలిపారు.

చిన్నబోతున్న చిన్నారి..!

- అంగన్‌వాడీ కేంద్రాల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- నిలిచిపోయిన మెడికల్ కిట్లు, ఆట వస్తువుల సరఫరా
- జూన్‌లో సరఫరా చేయాల్సిన పుస్తకాలను వారం రోజుల క్రితం పంపిన వైనం
- ఐసీడీఎస్ ఒంగోలు ప్రాజెక్టులో 19,132 మంది చిన్నారులకు అన్యాయం



ఒంగోలు రామ్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి (ఫైల్)

ఒంగోలు సిటీ: కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులు చిన్నబోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైనవన్నీ సరఫరా చేసి చిన్నారులకు మేలు చేయాల్సిన ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోంది. ఫలితంగా చిన్నారులకు అన్యాయం జరుగుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించారు. అంతేగాకుండా వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు అన్ని రకాలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని సమయానుకూలంగా అందించారు. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వాల్సిన మెడికల్ కిట్లు, ఆట వస్తువుల విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి జూన్‌లో పుస్తకాలు అందాల్సి ఉండగా, వారం రోజుల క్రితం పంపించారంటే ఎంత నిర్లక్ష్యం ప్రదర్శించారో అర్థంచేసుకోవచ్చు. అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు సంవత్సరం చివర్లో పుస్తకాలు పంపించడంపై తల్లిదండ్రుల నుంచి పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణ, గ్రామస్థాయిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మెడికల్ కిట్లు, ఆట వస్తువులు లేకపోవడంతో ఆయా కేంద్రాలకు వచ్చే చిన్నారులు ఏమీ తోచక ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రాల్లో మెడికల్ కిట్లు లేకపోవడంతో అత్యవసర సమయాల్లో చిన్నారులకు ప్రథమ చికిత్స చేయడంలో జాప్యం జరుగుతోంది. కేంద్రాల్లో మందులు అవసరమైతే ఆరోగ్య కార్యకర్తలపై ఆధారపడాల్సి వస్తోంది. మరోవైపు చిన్నారులు మానసికంగా ఎదుగుదలకు అవసరమైన సుమారు 25 రకాల ఆటవస్తువులు లేకపోవడంతో చిన్నారులు అవస్థపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి మెడికల్ కిట్లు, ఆట వస్తువులు సరఫరా చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఒంగోలు నియోజకవర్గంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అర్బన్ ఏరియా, కొత్తపట్నం, ఒంగోలు మండలంలో మొత్తం 274 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 0 నుంచి 6 నెలల్లోపు వయసు గల చిన్నారులు 1,726 మంది ఉన్నారు. 7 నెలల నుంచి ఒక సంవత్సరంలోపు చిన్నారులు 1,696 మంది ఉన్నారు. ఏడాది నుంచి మూడు సంవత్సరాల్లోపు చిన్నారులు 7,923 మంది, 3 నుంచి 6 సంవత్సరాల్లోపు చిన్నారులు 7,787 మంది చొప్పున మొత్తం 19,132 మంది ఉన్నారు. వీరిలో ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల్లోపు చిన్నారులకు ఇంటికే పౌష్టికాహారం అందజేస్తారు. మూడు సంవత్సరాలు దాటిన వారికి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్య అందించాలి. కానీ, అంగన్‌వాడీ కేంద్రాలకు నేటికీ మెడికల్ కిట్లు, ఆట వస్తువులు సరఫరా కాకపోవడం, పుస్తకాలు కూడా వారం క్రితమే రావడంతో ఆరు నెలలుగా వీరంతా ఖాళీగా ఉంటున్నారు.

సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం

అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. కేంద్రాలకు పుస్తకాలు పంపిణీ చేశాం. మెడికల్ కిట్లు, ఆట వస్తువులు కూడా త్వరలో పంపిణీ చేస్తాం. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పిస్తున్నాం.

– ఫణిరాజకుమారి, సీడీపీఓ, ఒంగోలు ప్రాజెక్టు

అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

- గరంగరంగా చీమకుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



విద్యుత్ సమస్యలపై ఆ శాఖ అధికారులతో చర్చిస్తున్న ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు

చీమకుర్తి రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం గరంగరంగా సాగింది. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.రాఘవేంద్ర పాల్గొని మాట్లాడారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని విద్యుత్ సమస్యలు, తాగునీటి సమస్యలను ప్రస్తావించారు. పారిశుధ్య సమస్యలపై అధికారులతో చర్చించారు. ప్రజాప్రతినిధుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక అధికారులు నీళ్ల నమలడంతో విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1,76,22,140 రూపాయలను విద్యుత్ శాఖ వారు సీఎఫ్ఎంఎస్ ద్వారా విడుదల చేసినట్లు ఎంపీపీ తెలిపారు. కానీ, మండలంలోని చాలా గ్రామాల్లో ఇంకా విద్యుత్ సమస్యలు ఉన్నాయన్నారు. పగటిపూట కూడా వీధిలైట్లు వెలుగుతున్నాయని, వదులుగా ఉన్న కరెంటు తీగలు సరిచేయకపోవడం, వంగిన స్తంభాలను సరిచేయకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని గత సర్వసభ్య సమావేశంలో కూడా తెలియజేశామన్నారు. కానీ, విద్యుత్ శాఖాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని అసహనం వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రతి గ్రామంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఏఈకి సూచించారు.

తాగునీటి సమస్యపై వాడీవేడీ చర్చ...

వైస్ ఎంపీపీ రావి లక్ష్మయ్య పులికొండ గ్రామంలో తాగునీటి సమస్య ఉందని సంబంధిత అధికారులకు తెలియజేశారు. వెంటనే నిప్పట్లపాడు ఎంపీటీసీ చిన్నపురెడ్డి వెంకటరెడ్డి కూడా అయప్పరాజుపాలెంలోనూ తాగునీటి సమస్య అధికంగా ఉందని సభ దృష్టికి తెచ్చారు. నీళ్ల సరిగా రావడం లేదని తెలిపారు. జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూనంనేనివారిపాలెం గ్రామంలో మంచినీటి పథకం ఉందని, ఆ గ్రామానికి మంచి నీరు అందకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ప్రజాప్రతినిధుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకపోగా, పొంతనలేని సమాధానాలను అధికారులు చెబుతున్నారని ఆగ్రహించారు. ఈవోఆర్డీ అజిత పారిశుద్ధ్యంపై మాట్లాడుతూ ఫాగింగ్ యంత్రాలు రిపేర్‌లో ఉన్నాయని, ప్రతి గ్రామంలో బ్లీచింగ్ చల్లడానికి నిధుల కొరత ఉందని ఎంపీపీ దృష్టికి తెచ్చారు. మండల ప్రజా పరిషత్ నిధుల నుంచి కేటాయిస్తానని ఎంపీపీ చెప్పారు. ప్రతి గ్రామంలో సీజనల్ వ్యాధులు రాకుండా బ్లీచింగ్, ఫాగింగ్ చేసేందుకు అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని ఎంపీపీ తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు నిలిపివేయడంపై ఆందోళన



కొప్పోలులో రాస్తారోకో చేస్తున్న స్థానికులు



రాస్తారోకోతో నిలిచిపోయిన వాహనాలు

- ఒంగోలులోని కొప్పోలులో రాస్తారోకో

ఒంగోలు సబర్బన్: నగరపాలక సంస్థ పరిధిలోని కొప్పోలు ప్రజలు ఆగ్రహించారు. నగరపాలక సంస్థ అధికారుల తీరును నిరసిస్తూ కొప్పోలులోని ప్రధాన రహదారిపై శనివారం రాస్తారోకో చేశారు. స్థానిక సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టడంతో కొత్తపట్నం–ఒంగోలు రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గ్రామంలోని మహిళలు, పురుషులు పెద్దసంఖ్యలో రోడ్డుమీదకు చేరుకుని ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులు చేతబట్టి నగరపాలక సంస్థ అధికారుల తీరుకు నిరసనగా ప్రదర్శన చేశారు. కొప్పోలు ప్రధాన రహదారి వెంట డ్రైనేజీ నిర్మాణ పనులను ఏడాది క్రితం ప్రారంభించారు. అప్పటి నుంచి మురుగు కాలువ నిర్మాణ పనులు పూర్తి చేయకుండా నిలిపివేశారు. కొప్పోలులోకి వెళ్లే రోడ్డులో కూడా అడ్డంగా డ్రైనేజీ కాలువ తవ్వారు. తవ్విన ప్రాంతంలో డ్రైనేజీ పైపులు వేయకపోవడంతో పాటు ఆ కాలువను పూడ్చి మట్టిపోశారు. దాంతో డ్రైనేజీ కాలువలో నేరుగా మురుగుపోయే మార్గం లేక ఆ మురుగు మొత్తం రోడ్డు మీదకు వచ్చి చేరుతోంది. ఆ రోడ్డులో దుర్గంధం వెదజల్లుతోంది. కొత్తపట్నం–ఒంగోలు రహదారి కావడంతో వాహనాల రాకపోకలతో రోడ్డు మీద ఉన్న బురదంతా నడుచుకుంటూ వెళ్లేవారిపై పడుతోంది. ద్విచక్ర వాహనదారులపై కూడా పడి దుర్గంధం వెదజల్లుతోంది. దీనిపై ఆగ్రహించిన కొప్పోలు ప్రజలు నగర పాలక సంస్థ అధికారులపై రాస్తారోకోతో ఆగ్రహం వ్యక్తం చేశారు.



క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న బూచేపల్లి

చీమకుర్తి రూరల్: చీమకుర్తి క్రిస్టియన్‌పాలెంలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాటిబండ్ల రాజసులోచన ఆధ్వర్యంలో కేక్ కటింగ్, పాట కచేరీ ఏర్పాటు చేయగా, ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. క్రిస్టియన్లకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, చీమకుర్తి మున్సిపల్ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, మండల జేసీఎస్ కన్వీనర్ చిన్నపరెడ్డి మస్తాన్‌రెడ్డి, చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు షేక్ బాషా, పాలడుగు సుబ్బారావు, మాజీ కౌన్సిలర్ పాటిబండ్ల శారద, మాజీ వార్డ్ మెంబర్ పాటిబండ్ల దానమ్మ, పాటిబండ్ల యువరాజు, పాటిబండ్ల ఆదాము, కొత్త మరియదాసు, అత్యాల దావీదు, మహిళా నాయకురాలు గుంటూరు రత్తమ్మ, గుంటూరు మేరీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం పరిశీలన



తాగునీటి పథకాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చీమకుర్తి రూరల్: మండలంలోని కూనంనేనివారిపాలెంలో తాగునీటి పథకాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు శనివారం పరిశీలించారు. ఈ పథకం నిరుపయోగంగా ఉండటంతో స్థానిక ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానిక ఎంపీటీసీ వేమ అశ్విని, సర్పంచ్ బక్క శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సమావేశం అనంతరం వారంతా కూనంనేనివారిపాలెం వెళ్లి తాగునీటి పథకాన్ని పరిశీలించారు. తాగునీటి పథకాన్ని ఉపయోగంలోకి తెస్తే మూడు గ్రామాలైన కూనంనేనివారిపాలెం, ఏలూరువారిపాలెం, మువ్వావారిపాలెం ప్రజల తాగునీటి అవసరాలు తీరుతాయని భావించారు. ఈ పథకంలో పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు తాగునీరు త్వరగా అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శాంతిప్రియకు జెడ్పీటీసీ సూచించారు.

పోలీసు డైరీ ఆవిష్కరించిన ఎస్పీ



పోలీసు అధికారుల అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: రాష్ట్ర పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ–2025ను ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆవిష్కరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన డైరీని ఆవిష్కరించి పోలీసు అధికారులకు అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... అధికారులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. సమర్థవంతంగా శాంతి భద్రతలను కాపాడాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించి మన్ననలు పొందాలని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీలు రాయపాటి శ్రీనివాసరావు, లక్ష్మీ నారాయణ, నాగరాజు, మహేశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, తిరుపతి స్వామి, బాషా తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాల నిర్మాణాలను వేగవంతం చేయాలి



పథకాలపై సమీక్షిస్తున్న డ్వామా పీడీ జోసఫ్ కుమార్

నాగులుప్పలపాడు: పాడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిర్మిస్తున్న మినీ గోకులాల షెడ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని డ్వామా పీడీ జోసఫ్ కుమార్ సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గోకులం షెడ్లు, ఫారం పాండ్ల నిర్మాణాలు, రూఫ్ వాటర్ సేకరణ నిర్మాణాలపై ఉపాధి పథకం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ జోసఫ్ కుమార్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 62 గోకులాల షెడ్లు మంజూరయ్యాయని, వాటిని జనవరి 10వ తేదీలోపు పూర్తి చేసేలా సిబ్బంది చొరవ చూపాలని సూచించారు. అలాగే గ్రామాల్లో ఉపాధి పథకం నిధులతో అమృత్ సరోవర్ పథకం కింద చెరువుల అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి అవాంతరాలు లేకుండా పనులను వేగవంతం చేయాలని చెప్పారు. ప్రతి వారం ఆయా పనులకు సంబంధించి నివేదిక అడగనున్నట్లు తెలిపారు. అనంతరం మద్దిరాలపాడు, చేకూరపాడు గ్రామాల్లో జరుగుతున్న గోకులాల షెడ్ల నిర్మాణాలను పరిశీలించారు. సమావేశంలో ఏపీడీ వెంకటస్వామి, సుబ్బారావు, ఏపీవో రవి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పశుగణనలో వివరాలు నమోదు చేసుకోవాలి



పశుగణన సర్వేను పరిశీలిస్తున్న జేడీ బేబీరాణి

నాగులుప్పలపాడు: జాతీయ పశుగణన పథకం ద్వారా రైతులు తమ పశువుల వివరాలు నమోదు చేసుకోవాలని పశు సంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బేబీరాణి సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న పశుగణన విధానాన్ని శనివారం ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం పాడిరైతుల కోసం రాయితీపై పశు గ్రాస విత్తనాలు అందజేయడంతో పాటు పశుగ్రాస క్షేత్రాల నిర్వహణ కూడా చేపట్టడం జరిగిందన్నారు. అర్హత ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్లతో పశువుల సంరక్షణ బాగుంటుందని తెలిపారు. అనంతరం పశువుల వ్యాక్సిన్, టీకాల అంశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, డాక్టర్ అనూరాధ, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతి కోసమే మహిళా సమైక్య



మహిళా సమైక్య సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం సుబ్బారావు

మద్దిపాడు: మహిళలను సంఘటితం చేస్తూ వారి ఆర్థిక స్వావలంబన సాధించే లక్ష్యంగా మహిళా సమైక్య పనిచేస్తోందని ఏపీఎం కాకుమాను సుబ్బారావు తెలిపారు. శనివారం మద్దిపాడులోని ఏపీఎం కార్యాలయ ఆవరణలో మహిళా సమైక్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు ఆధారిత జీవనోపాధులు, వ్యవసాయేతర జీవనోపాధులు, బ్యాంకు లింకేజీ, సామాజిక కార్యక్రమాలు, ఆర్థిక సంవత్సర కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఏపీఎం కాకుమాను సుబ్బారావు మాట్లాడుతూ మండల సమైక్య కలయికతో సమైక్య ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. సర్ఫ్ కార్యక్రమాల ద్వారా నిరుపేద మహిళలను సంఘటితం చేస్తూ వారు ఆర్థిక స్వావలంబన సాధించే లక్ష్యంతో సమైక్య పనిచేస్తోందని తెలిపారు. అన్ని ప్రభుత్వ సంస్థలు, ఇతర సంస్థలను అనుసంధానం చేయడం వలన మహిళా సమైక్య వారధిగా ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే ఆర్థిక బీమా, సాంఘిక భద్రత కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. గ్రామ సమైక్యలను మండల సమైక్య సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారం దిశగా పనిచేస్తోందన్నారు. ఒకరి కోసం అందరూ.. అందరి కోసం ఒకరు సహాయ సహకారాలు అందించుకోవడమే ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు. మహిళా సమైక్య ద్వారా ఉమ్మడి జీవనోపాధుల కార్యక్రమాలు, కొత్త పనులను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు, మహిళా సమైక్య సంఘ మహిళలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 22 అర్జీలు



సదస్సులో పాల్గొన్న మేయర్, తహసీల్దార్



మడనూరులో సర్టిఫికెట్లు అందిస్తున్న తహసీల్దార్ మధుసూదన్‌రావు

ఒంగోలు సబర్బన్: నగరపాలక సంస్థ పరిధిలోని వెంగముక్కలపాలెంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 22 అర్జీలు వచ్చాయి. ఒంగోలు తహసీల్దార్ ఎస్.వాసు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఒంగోలు నగర మేయర్, స్థానిక కార్పొరేటర్ గంగాడ సుజాత పాల్గొన్నారు. డివిజన్‌లోని పలు సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి ప్రజలు తీసుకెళ్లారు. వెంగముక్కలపాలెం, మామిడిపాలెంకు సంబంధించిన పలు రెవెన్యూ సమస్యలను ఆయా ప్రాంతాల ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఒంగోలు మండల సూపరింటెండెంట్ శీలం శ్రీనివాసరావు, మండల సర్వేయర్ నాళం వెంకటేశ్వర్లు, సర్వేయర్ ఎల్.విష్ణువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

మడనూరు గ్రామంలో 109 అర్జీలు...

కొత్తపట్నం: మండలంలోని మడనూరు గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ పి.మధుసూధన్‌రావు పాల్గొని మాట్లాడారు. వివిధ సమస్యలపై మొత్తం 109 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. పలువురికి అవసరమైన సర్టిఫికెట్లు అందజేశారు. ఆర్ఐ వరప్రసాద్, వీఆర్వో శంకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.